# జిల్లా కలెక్టర్ చొరవతో మత్స్యకారగ్రామాలకు సమకూరిన

# - మొబైల్ మెడికల్ యూనిట్



భీమవరం మార్చి 21ప్రభాతవార్త : "మీ ఇంటికి -- మీ డాక్టర్" ప్రాజెక్ట్ ను 3 సంవత్సరాల కాలంలో సి.ఎస్.ఆర్ మరియు గ్రామీణ విద్యుద్దీకరణ సంస్థ సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో వినూత్న ఆరోగ్య సేవల ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న రెడ్ క్రాస్ బ్రాంచీలలో 30 బ్రాంచీలను ఈ ప్రాజెక్టు అమలకు ఎంపిక చేయగా వాటిలో ఒకటి పశ్చిమ గోదావరి జిల్లాను ఎంపిక చేయడం విశేషం. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సమర్థ నాయకత్వంలో జిల్లాలో రెడ్ క్రాస్ కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నందున ఈ అవకాశాన్ని రాష్ట్ర శాఖ మన జిల్లాకి అందించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం ఈ ప్రాజెక్ట్ యొక్క ప్రధాన ఉద్దేశ్యం. శిశు, తల్లుల మరణాల రేటు తగ్గించడం, అంటువ్యాధుల వ్యాప్తిని నియంత్రించడం, మొత్తం మరణాల రేటును తగ్గించడం, 100% టీకాకరణ సాధించడం ప్రాజెక్ట్ ముఖ్యాంశాలుగా ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఒక మొబైల్ మెడికల్ యూనిట్ ను అందుబాటులోనికి తీసుకురావడం జరుగుతుంది. మొబైల్ మెడికల్ యూనిట్ తో పాటు ఒక డాక్టర్, ఒక నర్స్, ఒక ఫార్మసిస్ట్, ఒక డ్రైవర్ ఉంటారు. ఈ బృందం గ్రామాలలోని ప్రతి ఇంటిని సందర్శించి ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలు, సేవలు అందని వర్గాలు, ఎస్సీ, ఎస్టి కాలనీలు, పేద కుటుంబాలకు ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందిస్తుంది. గర్భిణీ స్త్రీలు, 0--6 సంవత్సరాల పిల్లలు, టిబి, డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులతో బాధపడుతున్నవారు, 60 సంవత్సరాల పైబడిన వృద్ధులు, జీవనశైలి సంబంధిత మరియు ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారికి వైద్య సహాయం అందించడం జరుగుతుంది. రోజుకు సుమారు 100 మందికి, నెలకు సుమారు 2,000 మందికి, సంవత్సరానికి సుమారు 25,000 మందికి వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు కొనసాగుతుంది. తొలుత మార్చి 23న ఈ ప్రాజెక్టును ప్రారంభించి, నరసాపురం మండలంలోని 18 గ్రామాల్లో తొలుత ఈ ప్రాజెక్ట్ ను అమలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఇప్పటికే అమలవుతున్న బ్లడ్ సర్వీసెస్ మరియు తలసేమియా సర్వీసెస్‌కు తోడుగా, ఈ "మీ ఇంటికి -- మీ డాక్టర్" ప్రాజెక్ట్ ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు అందించడం ద్వారా గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో పాటు, సమగ్ర ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావడం ద్వారా జిల్లా ప్రజలకు విశేష ప్రయోజనం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# మావుళ్ళమ్మ స్వర్ణ నిధికి 12గ్రా బంగారం

భీమవరం మార్చి 21 ప్రభాతవార్త : శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి స్వర్ణ నిధికి అండలూరు చెందిన చిలుకూరు రాంబాబు కుసుమరాణి దంపతులు లక్ష ఎనభై వేలు విలువ చేసే 12 గ్రాములు బంగారం విరాళంగా సమర్పించారు,వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు, ఆశీర్వచనాలు నిర్వహించారు.దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ఆలయ చైర్మన్ బొండాడ నాగ భూషణం ధరకర్తలు రామాయణం శ్రీనివాస్,ఉడిశి మీనాక్షి, అతికెల ఆంజనేయ ప్రసాద్,గుసిడి నాగశిరీష,గొంతిన రమణ,యండ సత్యవతి,మిర్తిపాటి గుణేశ్వరరావు,పాపాల ఏడుకొండలు ప్రసాదాలు ఫోటో అందచేసినారు..



# నిష్పక్షపాతంగా నిచారణ జరిపిస్తా

## -అనుదీప్ కుటుంబానికి అండగా ఉంటా- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

చాట్రాయి,మార్చి 21, ప్రభాతవార్త ఇటీవల మృతి చెందిన అంబటి అనుదీప్ మండలంలోని చాట్రాయి గ్రామంలో ఇటీవల మరణించిన అంబటి అనుదీప్ మరణంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఏలూరు జిల్లా ఎస్పీకి మంత్రి పార్థసారథి ఆదేశాలు జారీ చేశారు. మృతుని కుటుంబాన్ని మంత్రి పార్థసారథి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుదీప్ మృతి పలు అనుమానాలు రేకెత్తడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్థానిక పోలీసులు విచారణలో అనుమానాలు ఉంటే మరో అధికారిని నియమించి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. నూజివీడు నియోజవర్గ పోలీసులు కాకుండా ఇతర ప్రాంత పోలీసు అధికారులతో విచారణ జరిపించి సమగ్ర నివేదిక సమర్పించాలని నిజం నిగ్గు తీరుస్తామని కుటుంబీకులకు భరోసా ఇచ్చారు.బంధు,కుల, ప్రాంతీయ, రాజకీయ ప్రీతికి తావు లేకుండా అన్నిటికీ అతీతంగా న్యాయం జరిగేటట్లు మీకు అన్ని విధాల న్యాయం చేస్తానని తెలిపారు. ఈ విషయంలో మీకు అన్యాయం జరిగినట్లు తేల్తే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని మంత్రివర్యులు మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మందపాటి బసవరెడ్డి, ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, మోరంపూడి శ్రీనివాసరావు, మరిడి చిట్టిబాబు, కొమ్ముల కొండలరావు, అంబటి సత్యనారాయణ, తోటకూర వెంకటేశ్వరరావు,దామెర చిట్టిబాబు, అత్తులూరి శ్రీనివాసరావు, కొత్తపల్లి రామదాసు, కట్టా వెంకట దుర్గారావు, మాదాసు చంద్రకళ, తేళ్లూరి శేఖర్ జనసేన నాయకులు సవరం రామారావు, తుమ్మల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# సాహితీ వినీలాకాశంలో తళుక్కుమన్న రసరాజు

## -తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కేతాబు

తణుకు, మార్చి 21 ( ప్రభాత వార్త): సాహితీ వినీలాకాశంలో తణుకు పట్టణాన్ని తళుక్కుమని మెరిసేలా చేసిన అద్భుత సాహితీ ప్రతిభాశాలి రసరాజుగా పేరుందిన రంగినేని సత్యనారాయణ రాజు అని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం రాత్రి తణుకు సజ్జాపురం రామకృష్ణ మఠం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రసరాజు రాసిన చేతన కేతనం పద్య కవిత సంపుటి ఆవిష్కరించి మాట్లాడారు. తణుకు సాహితీ చరిత్రలో రసరాజు రచించిన కవితా సంపుటి భిన్నమైన అంశాలతో పాటు పండితులకు, సామాన్యులకు అర్థమయ్యే సరళ భాషలో రచించడం ఆయనలో ఉన్న భాషా నైపుణ్యాన్ని తెలియజేస్తుందని అన్నారు. 2007 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం అందుకున్న రసరాజు మధురకవి, సాహితీ కళాభిజ్ఞ అవార్డులు అందుకున్నారని పేర్కొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారాలతో పాటు అమెరికాలో తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో పురస్కారాలు పొందిన రసరాజు భవిష్యత్తులో మరిన్ని అవార్డులు, మా తాతయ్య గారి మీద ఒక పుస్తకం రాశారు అదే వేల్పూర్ గాంధీ దానిని చదువుతుంటే చాలా ఆనందం అనిపించింది అని అన్నారు, బిరుదులు పొందాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలతో పాటు కూటమి నాయకుడు పాల్గొన్నారు.



# పండగ వేళ పాఠాలు - పట్టించుకోని విద్యా శాఖాధికారులు

తణుకు, మార్చి 21 ( ప్రభాత వార్త) : పవిత్ర రంజాన్ పండగ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన పబ్లిక్ హాలిడే రోజున తణుకులో ఉన్న నారాయణ స్కూల్ యధావిధిగా పనిచేస్తుంటే విద్యాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోకుండా వీకెండ్ ఎంజాయ్ చేస్తున్నారనీ, ఇదేమిటని ప్రశ్నించడానికి స్కూలుకు వెళ్లిన ఐసా నాయకుల పై నారాయణ యాజమాన్యం దురుసుగా ప్రవర్తించడం సిగ్గుమాలిన చర్య అని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏ ఐ యస్ ఏ) జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి విమర్శించారు. ఈ సందర్భంగా ఐసా జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి మాట్లాడుతూ శనివారం తణుకులో ఉన్న నారాయణ స్కూల్లో తరగతులు నిర్వహిస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేసిన కారణంగా విద్యార్థి సంఘం నాయకులు స్కూలు ఉద్యోగులను అడుగుతున్న క్రమంలో వారు మేము ఇలాగే స్కూల్ రన్ చేస్తాం మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి అని సమాధానం చెబుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో చాలా కీలకంగా వ్యవహరిస్తూ ఒక రాష్ట్ర మంత్రి నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాలు ఈ రకంగా వ్యవహరించడం దుర్మార్గమైన చర్యఅని వారు ధ్వజమెత్తారు. యాధేచ్ఛగా విద్యా వ్యాపారం చేస్తూ విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని ఈ విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు, లేని పక్షం లో పోరాటం ఉదృతం చేస్తామని సంఘ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యు మురళి తదితరులు పాల్గొన్నారు.



# రంజాన్ పండుగ వేడుకలు

మొగల్తూరు మార్చి 21 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామంలో శనివారం ఉదయం పవిత్రమైన రంజాన్ పండుగను గ్రామంలోని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు నెలరోజులపాటు ఉపవాస దీక్షలు పాటించిన అనంతరం ఈద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు గ్రామంలోని మసీదులో ఉదయం నుంచి ప్రార్థన కొనసాగగా పెద్ద ఎత్తున భక్తులు హాజరై శాంతి సౌభాగ్యం కోసం ప్రార్థించారు అనంతరం మొగల్తూరు గ్రామంలో ఉన్న మసీదు నుండి ముస్లిం సోదరులు ర్యాలీగా బయలుదేరి గ్రామంలో తిరుగుతూ ప్రార్థన నిర్వహించారు ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ముస్లింలు సంప్రదాయ వంటకాలు తయారుచేసి కుటుంబ సభ్యులతో స్నేహితులతో పంచుకున్నారు చిన్నారులు కొత్త బట్టలు ధరించి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మహబూబ్ అలీ అధ్యక్షులు ఉస్మాన్ జి వైస్ ప్రెసిడెంట్ హుస్సేన్ సాహెబ్ సెక్రటరీ ప్రసాద్ జాయింట్ సెక్రెటరీ అమీర్ భాష ట్రెజరర్ షరీఫ్ నెంబర్స్ వలి అన్వర్ షారుక్ ఖాన్ మస్తాన్ రఫీ సుభాను నజీర్ రాహుల్ మరియు ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# శాస్త్రవేత్తలుగా రూపొందుటకు ఉపాధ్యాయులే కీలకం : ఎమ్మెల్సీ బొర్రా

భీమవరం టౌన్ మార్చి 21 : ప్రభాతవార్త : విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొం దించి శాస్త్రవేత్తలుగా రూపొందించుటలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి అన్నారు. శనివారం యుటిఎఫ్ కార్యాల యంలో ఏపీ బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవ సంబరాలు నిర్వహించారు. గోపి మూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయుడే మార్గదర్శిగా ఉంటాడని అన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణ మాట్లాడు తూ ప్రతి ఉపాధ్యాయుడు బోధనలో భాగంగా ప్రయోగాలు కృత్యాలు చేసి బోధిస్తే మరింత ఆకర్షణీయంగా ఉంటుందని సూచించారు బయోలజి సైన్స్ టీచర్స్ ఫోరం ఇలాంటి కార్యక్రమం చేయడం ఎంతైనా అభినంద నీయమన్నారు.ఇటీవల పదవి విరమణ పొందిన జీవశాస్త్ర ఉపాధ్యా యులు ఎస్ఆర్పిలుగా పనిచేసిన వివిఎజెడ్ శ్యాంప్రసాద్ మరియు భాస్కర రావు మాట్లాడుతూ సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించి సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంచాలని శాస్త్రీయ బీజాలు నాటాలని అన్నారు సైన్స్ విభాగంలో మహిళల పాత్ర ,సాధించిన విజయాలు గురించి ఉపాధ్యాయిని కె. శ్రీ లత తెలిపారు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం గౌరవ అధ్యక్షులు మొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రీయ వైఖరుల గురించి శాస్త్రవేత్తల సేవలు గురించి పాఠ్యపుస్తకాలు అంశాల గురించి ప్రస్తావించారు బియ్యం గోపాల్ రెడ్డి చక్కటి సైన్స్ ప్రయోగాలు చేసి ఆశ్చర్యపరిచారు సైన్స్ టీచర్స్ ఫోరం కార్యదర్శి శ్రీ జి. సుకుమార్ మాట్లాడుతూ నిజజీవితంలో ఎదురయ్యే ఎన్నో సవాళ్లకు సైన్సే పరిష్కారం చూపిస్తుందని అన్నారు అనంతరం జీవశాస్త్ర ఉపాధ్యాయులకు విశిష్ట సేవలు అందించిన వారికి ఘన సన్మానం చేశారు.



# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

## - మంత్రికి తెదేపా నేతలు వినతి

చాట్రాయి, మార్చి 21, ప్రభాతవార్త : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి కొలుసు పార్థసారథికి తెలుగుదేశం పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. మొక్కజొన్న చేతికి వచ్చినందున బయట మార్కెట్ లో దళారీలు తక్కువ ధరకు అడుగుతున్నారని తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి పార్థసారథి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెం నాయుడుతో మాట్లాడి త్వరలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, మందపాటి బసవరెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, తుమ్మగూడెం సహకార సంఘం అధ్యక్షులు దామెర చిట్టిబాబు, రాయవరపు పుల్లారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.



# ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ లక్ష రూపాయల ఆర్థిక సాయం

వేలేరుపాడు, మార్చి 21 (ప్రభాత వార్త ) : ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేలేరుపాడు మండలం కోయ మాదారం గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాద బాధితులను శనివారం టీచర్స్ అందరు కలిసి స్వయంగా పరామర్శించారు.ప్రమాద బాధితులయిన కారం రాంబాబుకు 30వేలు, కుంజా మంగరాజుకు 20వేలు,కుంజా చరణ్కు 20వేలు,కట్టం కార్తీక్ కి 20వేలు, కీ.శే. మొట్టుం సిద్దుకు 10వేలుగా మొత్తం నగదు లక్ష రూపాయలను టీచర్స్ అందరూ బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటిఏ రాష్ట్ర శాఖ తరపున రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సోదెం రాజు, రాష్ట్ర కోశాధికారి చిర్రి దేవరాజు మరియు రాష్ట్ర కార్యదర్శి పూరేం సీతారాముడు వేలేరుపాడు మండల నాయుకులు బంధం వీరబాబు పాయం రమేష్ బంధం ముత్యాలరావు పూనెం సుందర్ కుంజా రాముడు కట్టాం రామమూర్తి కారం నాగేశ్వరరావు సోడే విశాల్ పిట్టా మధు మచ్చ రాంబాబు కుంజా వెంకన్నబాబు తెల్లం వెంకట్రావు మడివి బలరాం కుంజా ప్రసాద్ ఏలూరు జిల్లా శాఖ తరపున జిల్లా అధ్యక్షులు సరియం నాగేశ్వరరావు ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంత ఐదు మండలాల ఏటిఏ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మరియు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అపర భద్రాద్రిలో వార్షిక బ్రహ్మోత్సవాలు

## - గోడపత్రికను ఆవిష్కరించిన మంత్రి పార్థసారథి

చాట్రాయి, మార్చి 21, ప్రభుతవార్త చాట్రాయి మండలంలో సునుబండ గ్రామంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీకోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గోడ పోస్టర్ ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ చనుబండ గ్రామంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ప్రాంతీయ ప్రజలు ఆధ్యాత్మిక అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. శ్రీకోదండ రామస్వామి ఆలయం పురాతన వైభవాన్ని సంతరించుకుని భక్తులకు విశేషంగా ఆకర్షణీయంగా నిలుస్తోందన్నారు. బ్రహ్మోత్సవాలు నిర్వహణలో దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. ఉత్సవాలలో భాగంగా పలు ధార్మిక కార్యక్రమాలు, స్వామివారి దర్శనాలు, వాహన సేవలు, ప్రత్యేక పూజలు భక్తులు తాకిడికి అనుగుణంగా ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ మహోత్సవాలను విజయవంతం చెయ్యాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్ పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, పాలకవర్గ సభ్యులు, మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, తెలుగుదేశం నాయకులు అఖిల భారత బ్రాహ్మణ సంఘ నాయకులు గోటేటి సుబ్రహ్మణ్యం, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# నేడు నూజివీడుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత రాక

నూజివీడు, మార్చి 21 ప్రభాతవార్త: నూజివీడులో ఆదివారం రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పర్యటించనున్నారు. రేనాటి వీరుడు, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. మొట్టమొదటి సిపాయిల తిరుగుబాటుకు (1857) ముందే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వడ్డే ఓబన్న పోరాటం జరిపారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యానికి వెన్నెముకగా నిలిచి గొరిల్లా యుద్ధం చేశారు. ఈ పోరాటంలో ఆయన 39వ ఏట అమరు దయ్యారు. వడ్డే ఓబన్న సాగించిన అలుపెరుగని పోరాటం రేనాటి సీమలో బ్రిటిష్ పాలకుల్లో వణుకు పుట్టించింది. ఆంగ్లేయుల దాస్య శృంఖాల నుంచి భరతమాతను రక్షించడానికి ఓబన్న జరిపిన పోరాటం స్ఫూర్తిదాయకం. ఓబన్న సేవలను కొనియాడుతూ, ఆయన పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందజేయడానికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ వస్తోంది. నూజివీడులో ఉమ్మడి కృష్ణా జిల్లా వడియరాజులు(వడ్డెర్ల) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు రోడ్డు మార్గం ద్వారా విజయవాడ నుంచి నూజివీడుకు మంత్రి సవిత చేరుకోనున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని మంత్రి మాట్లాడనున్నారు. అనంతరం ఆమె విజయవాడకు తిరుగుపయనవుతారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి. తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా పంచాయతీ కార్యాలయం

## పట్టించుకోని అధికారులు

మొగల్తూరు మార్చి 21(ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పాతపాడు పంచాయతీ పరిధిలో ఉన్న పంచాయతీ కార్యాలయం అద్వానంగా తయారయ్యింది ఈ సందర్భంగా శుక్రవారం స్థానికులు మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చిన ప్రజలు మురుగు నీరు చెత్త మధ్యలో వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందని అంతేకాకుండా కార్యాలయం లోపల కూడా శుభ్రత లేకపోవడంతో పంచాయతీ సేవలు సక్రమంగా అందడం లేదని ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు ప్రజల సమస్యలను పరిష్కరించవలసిన పంచాయతీ కార్యాలయం స్వయంగా సమస్యల కేంద్రంగా మారడం పట్ల గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పంచాయతీ కార్యాలయాన్ని మరమ్మతులు చేసి శుభ్రత చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు



# కేంద్రీయ విద్యాలయ

## నూజివీడులో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకారం

నూజివీడు, మార్చి 21 ప్రభాతవార్త: నూజివీడులో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయా లో 2026-27విద్యా సంవత్సరానికి గాను 1వ తరగతి ప్రవేశాల కోసం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ఈ నెల 20వ తేదీ ఉదయం 10:00 గంటలకు ప్రారంభమైందని ఇంచార్జి ప్రిన్సిపాల్ ఫరూఖ్ మహ్మద్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రక్రియ 02.04.2026న ముగుస్తుందన్నారు. విద్యాలయా లో ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు https://kvsangathan.nic.in/en/admission/ అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. 1వ తరగతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి లింక్: https://admission.kvs.gov.in. 1వ తరగతిలో ప్రవేశానికి కనీస వయస్సు 6 సంవత్సరాలు ఉండాలి. అన్ని తరగతులకూ వయస్సు నిర్ధారణను 31.03.2026 నాటికి పరిగణనలోకి తీసుకుంటారు. సీట్ల రిజర్వేషన్ అనేది ఖచ్చ ప్రవేశ మార్గదర్శకాలు 2026-27 ప్రకారం ఉంటుంది. 2 నుండి 5వ తరగతుల ప్రవేశాల కోసం ఆఫ్‌లైన్ నమోదు ప్రక్రియ 20.03.2026న ఉదయం 10:00 గంటలకు ప్రారంభమై, 02.04.2026న సాయంత్రం 04:00 గంటల వరకు కొనసాగుతుంది. సరిగ్గా పూరించిన దరఖాస్తు పత్రాన్ని ఖచ నూజివీడు ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని అయన తెలిపారు.

# అనాథ ఆశ్రమంలో దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు

భీమవరం మార్చి 21 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనవడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్ కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు ఆధ్వర్యంలో భీమవరంలోని అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి చిన్నారులతో కలిసి ఆనందంగా వేడుకలను నిర్వహించారు. చిన్నారులకు అన్నదానం నిర్వహించి వారితో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి ఆనందంలో భాగస్వాములైయ్యారు. దేవాన్ష్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ త్రిమూర్తులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మైలబత్తుల హైజాక్ బాబు, భీమవరం టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము చల్లబోయిన గోవింద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మాదాసు కనకదుర్గ, జాయింట్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాసరావు, కాపా అమర్ బాబు, విన్నకోట వినాయక బాబు, చెరుకు తిరుపతిరావు, గంధం రాధ, భీమవరం టీడీపీ పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు జోగేశ్వరి, వలవల ఆదిలక్ష్మి, శ్రీలక్ష్మి స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

## గోదావరిలో విషాదం: ఐదుగురు యువకులు గల్లంతు

### - ముగ్గురు మృతదేహా లభ్యం, ఇద్దరి కోసం గాలింపు



కుక్కునూరు, మార్చి 20 (ప్రభాతవార్త): కుక్కునూరు మండలం వేలేరు గ్రామ పరిధిలో గోదావరి నదిలో ఈతకు వెళ్లిన యువకుల గుంపులో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఏడుగురు యువకులలో ఐదుగురు అనుకోకుండా నీటిలో మునిగిపోగా, ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. ఇద్దరు మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. మృతులు వివరాలు ఇలా ఉన్నాయి. చెగొంట్ల శ్రీకార గుప్త (భద్రాచలం), దగ్గుపాటి నవదీప్ (ఉయ్యూరు), పొడిచేటి అభిరామ్ (భద్రాచలం), గల్లంతైన వారు పాసం సతీష్ కుమార్ (మదనపల్లి) గొనే తేజాగ్న (ఉయ్యూరు) ఉన్నారు. ఈ ప్రమాదంలో చుండూరి దీపక్ (కలిదిండి) గెడ్డం హర్షవర్ధన్ (విజయనగరం) సమాచారం అందుకున్న వెంటనే కుక్కునూరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఈడీఆర్ఎఫ్ బృందాల సహకారంతో గల్లంతైన ఇద్దరి కోసం విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. ఈ ఘటనపై కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసును సీఐ ఎం. రమేష్ బాబు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ, నదులు మరియు జలాశయాలలో ఈతకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లరాదని సూచించారు.

## ధర్మాజీగూడెం కళ్యాణ మండపంలో నమాజ్ చేసిన ముస్లిం సోదరులు.



లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు అందరూ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు అందరూ భక్తిశ్రద్ధలతో నమోదు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో మసీదు మతగురువు ఇబ్రహీం ప్రార్ధన మరియు నమాజ్ చేయించారు ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు ఎండి గౌస్ భాష సెక్రటరీ షేక్ సయ్యద్ బాజీ ట్రెజరర్ ఎస్ ఎం సుభాని. జమాత్ అధ్యక్షులు ఎస్.కె సాదిక్. మరియు గ్రామ పెద్దలు షేక్ లాల్ అహ్మద్. భాషి. మస్తాన్.షరీఫ్. షేక్ చోటా సాహెబ్.నాగులు. తే హార.అమీర్. హుస్సేన్ సాహెబ్.యాసిన్. మరియు ఎలక్ట్రికల్ డి ఈ. అహ్మద్ ఖాన్. ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## రెండేళ్ళుగా పేదల కాలనీలపై ప్రభుత్వం కక్ష్య సాధిస్తుంది



భీమవరం టౌన్ మార్చి 21 : ప్రభాతవార్త : రాష్ట్రంలో పేదలకు నివాసాలతోసహా కనీస వసతులు కరువయ్యాయని, గత రెండేళ్లుగా ప్రభుత్వం పేదల కాలనీల అభివృద్ధిపై కాక కక్ష సాధింపుగా పనిచేస్తుందని పశ్చిమగోదా వరి జిల్లా సిపిఎం కార్యదర్శి జె ఎన్ వి గోపా లన్ విమర్శించారు. జిల్లాలో ప్రజా సమస్య ల పరిష్కారానికై ఫిబ్రవరి 26వ తేదీన సిపి ఎం ఆధ్వర్యంలో ఆకివీడు మండలం తాళ్ల కోడు వంద నుండి చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర 24వ రోజైన శనివారం భీమ వరం టౌన్ (మెంటేవారితోట) లోనికి ప్రవేశించిన సందర్భంగా స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్య పాదయాత్ర గత 24 రోజులుగా 20 మండలాలలో ఆరు మునిసిపాలిటీలలో కొనసాగుతూ 600 కిలోమీటర్లకు చేరుకుందని అన్నారు. పట్టణంలో మరో 50 కిలోమీటర్లు జరగనున్న పాదయాత్ర రెండు రోజుల పాటు జరిగి తాము నిర్దేశించుకున్న 26 రోజులు, 650 కిలోమీటర్లు పాదయాత్ర 23వ తేదీన భీమవరంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగనున్న బహిరంగ సభతో ముగుస్తుం దన్నారు. గత 24 రోజులుగా తమ పాద యాత్రలో ప్రజాసమస్యలతో కూడిన నాలుగు వేలకు పైగా అర్జీలు స్వీకరించామన్నారు.

## అందమైన రూపంలో వ్యక్తపరిచే సాహిత్య ప్రక్రియే కవిత్వం

### - రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీత డా పిప్పళ్ల



భీమవరం మర్చి 21 ప్రభాతవార్త :కవిత అనేది కేవలం పదాల సమాహారం కాదని, అది మనసు మాట, భావోద్వేగాలు, అనుభవాలు, కలలు, ఆశలని రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార అవార్డు గ్రహీత డా పిప్పళ్ల ప్రసాద్ అన్నారు. భీమవరం శ్రీభీమేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ కవిత దినోత్సవాన్ని నిర్వహించారు.

## వరాల వెంకన్న ను దర్శించుకున్న భక్తులు

అత్తిలి, మార్చి20( ప్రభాత వార్త ): అత్తిలి మండలం ఈడూరు గ్రామం లో గల వరాల వేంకటేశ్వరస్వామిని శనివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ,, తోమాల సేవ , విశేష అర్చనలు జరిపారు. భక్తుల సహకారంతో గోవింద నామాలను పఠించారు. దేవాలయ కమిటీ సహకారం తో అన్నదానం జరిపారు.అత్తిలి రైల్వే స్టేషన్ రోడ్డులో గల బాలాజీ వేంకటేశ్వరస్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు , వల్లి వెంకటేష్ , సూర్య తేజ ఆధ్వర్యంలో అర్చనలు జరిపారు.స్వామి వారిని విశేషంగా అలంకరించారు.

## ఆ అధికారికి మళ్ళీ 2 బంగారు పతకాలు



భీమవరం టౌన్, మార్చి 21 : ప్రభాతవార్త :2026 ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్ లో జరిగిన నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ నందు 5 విభాగాల్లో పాల్గొని 5 పతకాలు ( 2 బంగారు, 2 వెండి, 1 కాంస్య ) సాధించిన పశ్చిమగోదావరి జిల్లా ఉప మలేరియా అధికారి యాతం నాగబాబు, నెల రోజుల్లోనే 2026 మార్చి 20, 21 తేదీల్లో చండీఘడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెక్టార్ బి7 హర్యానా రాష్ట్రంలో 5 వ ఖేల్ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ ఛాంపియన్ షిప్ నందు 3 విభాగాల్లో పాల్గొని 3 పతకాలు ( 2 బంగారు,1 కాంస్య ) సాధించి తన సత్తా చాటుకున్నారు. ఇది యాదృశ్చిక సంఘటన ఎంత మాత్రం కాదని ఆయన సాధించిన విజయాలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. మొత్తం 18 రాష్ట్రాలు పాల్గొన్న ఈ అథ్లెటిక్స్ లో 1400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 800 మీటర్ల పరుగు పందెం నందు మొదటి స్థానం బంగారు పతకం, మరియు 400 మీటర్ల పరుగు పందెం నందు (మొదటి స్థానం) బంగారు పతకం, మరియు 1500 మీటర్ల పరుగు పందెం నందు (మూడవ స్థానం) కాంస్య పతకం సాధించి మరోసారి వార్తల్లో నిలిచిన యాతం నాగబాబు ఇప్పటికే 92 పతకాలు సాధించగా తాజాగా సాధించిన 3 పతకాలతో ఆయన పతకాల సంఖ్య 95 కు చేరింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం, కనీస గుర్తింపు లేకపోవడం దురదృష్టకరమని క్రీడాకారులు వ్యాఖ్యానిస్తున్నారు. పతకాల వీరుడు నాగబాబుకు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

# అన్నదాతలను ఆదుకోండి

### - దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సిపిఐ బృందం



వేలేరుపాడు, మార్చి 21(ప్రభాత వార్త ): భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో శనివారం వేలేరుపాడు మండలంలో అకాల వర్షాల కారణంగా తడిసిన మిర్చి మొక్కజొన్న వేరుశనగ పుల్ల శనగా కంది తదితర పంటలను పరిశీలించారు. తడిసిన మిర్చి మొక్కజొన్న తదితర పంటలను ప్రభుత్వం మద్దతు దరకే కొనుగోలు చేసి రైతులని ఆదుకోవాలని ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి తీరా పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షం కారణంగా చాలామంది రైతుల కళ్లాల్లో మిర్చి మొక్కజొన్న వేరుశనగ పుల్లశనగ కంది పంటలు తడిసిపోయాయని కాబట్టి ప్రభుత్వం వెంటనే నష్టపోయినటువంటి పంటలను అంచనా వేసి ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం ఇచ్చి రైతులని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కారం దారయ్య సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పిట్టా ప్రసాద్ సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మడివి కామయ్య మేడ శ్రీనివాసరావు ఏపీ జీవిస్ మండల కార్యదర్శి బంధం అర్జున్ మండల కార్యదర్శి బంధం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ పుట్టాపై అసత్య ప్రచారాలు తగవు నాలి శ్రీనివాస్



జీలుగుమిల్లి, మార్చి 21, ప్రభాతవార్త : ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌పై జరుగుతున్న అసత్య ప్రచారాలను యాదవ సంఘం నాయకుడు నాలి శ్రీనివాస్ ఖండించారు. అభివృద్ధిని తట్టుకోలేక రాజకీయ కుట్రతో డ్రగ్స్ కేసులో ఇరికించారని ఆరోపించారు. శనివారం మండలంలోని పి అంకంపాలెంలో ఆయన మాట్లాడుతూ మొదట నెగిటివ్‌గా వచ్చిన పరీక్షలు తరువాత పాజిటివ్‌గా రావడం అనుమానాస్పదమని, పరీక్షల ప్రక్రియపై సందేహాలు ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి, ఉపాధి కల్పనలో ఎంపీ చేస్తున్న కృషిని చూసి కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎంపీ మహేష్ కుమార్ యాదవ్‌కు బడుగు బలహీన వర్గాల మద్దతు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పేరుబోయిన దాము, కూరాకుల రవీంద్ర, తోట బాలు, మేకల శ్రీను, దగ్గు మల్లి ఆంజనేయులు, అన్నవరపు దుర్గారావు, ఈడ దుర్గారావు, ఈడా ఎంకన్నబాబు, కోటా శ్రీను, మామిళ్ళ వెంకట్రావు, తోట పుల్లారావు తదితరులు పాల్గొన్నారు

## అప్పారి ఆశయాలను సాధిద్దాం : ఎమ్మెల్సీ



భీమవరం టౌన్ మార్చి 21: ప్రభాతవార్త : అమరజీవి అప్పారి వెంకటస్వామి 25 వ వర్ధంతి సందర్భంగా శనివారం భీమవరం యూటీఎఫ్ జిల్లా కార్యాలయం నందు ఆ మహనీయునికి నివాళు లు అర్పించారు కార్యక్రమం జిల్లా గౌరవాధ్యక్షులు సి. హెచ్.పట్టాభిరామయ్య అధ్యక్షతన జరుగింది. ముఖ్యఅతిథిగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి పాల్గొని అప్పారి వెంకట స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన గోపిమూర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్మాణం కోసం ఆయన అనేక త్యాగాలు చేశారని,16 సంవత్సరాల సర్వీసును తృణప్రాయంగా వదిలి 25 సంవత్సరాలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి ఉపాధ్యాయుల ఉన్నతికి కృషి చేశారన్నారు. ఉపాధ్యా యులు విద్యార్థుల పురోగతికి బాటలు వేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాఅధ్యక్షుడు పి.ఎస్.విజయరామరాజు, రాష్ట్రకార్య వర్గసభ్యులు, జి.వి.వి.రామను జరావు,జిల్లా కార్యదర్శిలు జి.రామకృ ష్ణశీరాజు, సి.హెచ్.కుమారబాబ్జి, కె.శ్రీరామ కృష్ణప్రసాద్, జిల్లాకార్యవర్గసభ్యులు ఎన్.నరసింహయ్య, బి.నాగబాబు, కె.వమనమూర్తి, బి.ఆర్.ఎం.కె.స్వామి, కె.వి.మల్లీశ్వరరావు, బి.నరేష్, ఎం.శివ రామరాజు, మల్లుల శ్రీనివాస్, జి.సుకుమార్ మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దస్తావేజు పోయినది

**ఏలూరు జిల్లా, చాట్రాయి మండలం, చాట్రాయి గ్రామానికి చెందిన అలా శోభనాద్రి S/O అంజయ్య కు సంబంధించిన దస్తావేజు నెం. 4293/2017, సర్వే నెం.578/5, య. 0.25 భూమి ఒరిజినల్ దస్తగిరి పోయినది. దొరికిన వారు ఫోన్ నెం. 8247 816680 కు ఫోన్ చేయగలరు.**

## ముత్యాలమ్మ గుడి వద్ద అన్నసమారాధన



టీ నర్సాపురం మార్చి 21 ప్రభాతవార్త: టీ నర్సాపురంలో గ్రామ దేవత ముత్యాలమ్మ వారి 12వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు శనివారం ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అఖండ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.. ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ. దాతల సహకారంతో ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించామని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశామని వివరించారు. ఈ కార్యక్రమంలోపబ్బు జయరాజు ఈడ నాగరాజు గుర్రం సత్యనారాయణ గుడిసె శీను తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పాత ఆలయం తొలగింపు



అత్తిలి, మార్చి 21 (ప్రభాత వార్త ) అత్తిలి రామన్నపేటలో నూతనంగా నిర్మించబోయే చాలామ్మ తల్లి పునర్నిర్మాణ కోసం పాద ఆలయం తొలగింపు కార్యక్రమాన్ని దేవాలయం కమిటీ వారు చేపట్టారు. ప్రస్తుతం గల ఆలయం చిన్నదిగా ఉండడంతో పూజాది కార్యక్రమాలకు అసౌకర్యంగా ఉంటుందని భావించి నూతన ఆలయం నిర్మాణానికి ఆలయ కమిటీ వారు నిర్ణయించారు. ఈనెల 28న నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా ప్రస్తుతం గల ఆలయాన్ని తొలగించే కార్యక్రమం చేపట్టి అమ్మవారిని సమీపంలో గల ఆలయానికి తరలించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహం తరలింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

## ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఆగిరిపల్లి: మార్చి 21 ప్రభాతవార్త : స్థానిక జామియా మసీదు ఈద్గాలో ముస్లిం సోదరులు రంజాన్ ను పురస్కరించుకొని శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కఠిన ఉపవాస దీక్షలు ఆచరించిననంతరం ఆ ముస్లిం సోదరులు శనివారం ఈదుల్ ఫితర్ (రంజాన్) పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ తెలుపుకుంటూ పండుగ నిర్వహించుకున్నారు. ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన పండుగఒకటైన రంజాన్ పండుగ. ఆత్మ నియంత్రణ, సహనం, దయ, దాన ధర్మాల ప్రాధాన్యతను తెలియజేసే పర్వదినంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ పండుగ సోదరభావం, సమానత్వం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆగిరిపల్లి మండల వ్యాప్తంగా ముస్లింలు మసీదులకు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహించుకొని మత పెద్దలు ఉపదేశించిన ప్రబోధనలు విన్నారు. మండలంలోని మక్కా మసీదు ,జామియా మసీదు శోభనాపురం గ్రామంలోని బిలాల్ మసీదు, ఈదర, నెక్కలం గొల్లగూడెం, ఎం సురవరం గ్రామాల మసీదులను సుందరంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలునిర్వహించి పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పండుగ సందర్భంగా పెద్దలు చిన్నవారికి ఆశీర్వాదాలు అందించగా, ముస్లిం సోదరులు దానధర్మాలు నిర్వహించారు.

## బంగారం చోరీ కేసులో ముగ్గురు ముద్దాయిలు అరెస్టు, జంగారెడ్డిగూడెం ఎస్పీ సుస్మిత ఆర్



చింతలపూడి, మార్చి 21, ప్రభాతవార్త : చింతలపూడి సర్కిల్ పరిధిలో బంగారం చోరీ కేసును చేదించి ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎస్పీ సుస్మిత ఆర్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చింతలపూడి సర్కిల్ పరిధిలో ఫిబ్రవరి 27, మార్చి 03వ తేదీలలో రెండు దొంగతనాలు జరిగినట్లు తెలిపారు. మండలంలోని గణిజర్ల లో బుల్లా భూలక్ష్మి ఇంట్లో మధ్యాహ్న ఎవరు లేని సమయంలో బీరువా తాళాలు పగలు కొట్టి బంగారం దోచుకెళ్లారు. అదేవిధంగా 2024 లో పాతిమపురంలో జరిగిన బంగారం దొంగతనం కేసులో ముద్దాయిలు వేలిముద్రలు మ్యాచ్ అయ్యాయి. ఈ కేసును చేదించేందుకు ఏర్పాటు చేసిన బృందం ఒక అనుమానస్పద వ్యక్తిని పట్టుకోవడం జరిగింది. ఈ వ్యక్తితో పాటు గణిజర్ల, పాతిమపురం లో దొంగతనం జరిగిన గోల్డ్ రికవరీ చేసి, ముగ్గురు ముద్దాయిలైన దుక్కిపాటి కిషోర్, కొట్టే రమేష్, మూర్ల చార్లెస్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురు చింతలపూడి పరిసర ప్రాంతాలకు చెందిన వారని తెలిపారు. నిందితులో ఒకరైన బోడా ప్రదీప్ ధర్మాజీగూడెం స్టేషన్ పరిధిలో జరిగిన గోల్డ్ దొంగతనం కేసులో 38 గ్రా.బంగారం రికవరీ చేసినట్లు తెలిపారు. ముద్దాయిలు ఇంటికి తాళం వేసి పనులకు వెళ్లే వారి ఇళ్ళు టార్గెట్ చేసి దొంగతనాలు చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ కేసును చేదించిన సీఐ క్రాంతికుమార్, ఎస్ ఐ లు, సతీష్ కుమార్, వెంకన్న, పి సి లు,సీతా దేవయ్య, వెంకటేశ్వరావు, సత్యనారాయణలకు జిల్లా పోలీస్ కేంద్రం నుండి ప్రశంస పత్రాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## ఘనంగా శ్రీ సీతారామ ఆలయ రాతి విగ్రహాల పునఃప్రతిష్ట



జీలుగుమిల్లి, మార్చి 21, ప్రభాతావార్త : హిందూ సంప్రదాయంలో దేవతా విగ్రహాలు భగవంతుని చైతన్యాన్ని ఒక రూపంలో దర్శించేందుకు, ఆరాధించేందుకు శాస్త్రోక్త పద్ధతిలో ప్రాణ ప్రతిష్ట ద్వారా దైవత్వాన్ని సంతరించుకుంటాయని విశ్వహిందూ పరిషత్ కార్యకర్త వేదుల జనార్ధనరావు తెలిపారు. శనివారం మండలంలోని పాత పండువారిగూడెంలో గిరిజనుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల ఆలయంలో రాతి విగ్రహాల పునఃప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ సున్నం సురేష్--ఉషారాణి దంపతులు రాతి విగ్రహాలను దేవాలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా బుత్వికులు జటావల్లభుల రవికుమార్ నేతృత్వంలో వేదమంత్రోచ్చరణల మధ్య యజ్ఞాలు, హోమాలు నిర్వహించి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వంకవారి గూడెం గ్రామ సర్పంచ్ కుంజా పార్వతి, కుంజా చిన్న రాముడు, ఊకా సూర్య చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## టీ నర్సాపురంలో భక్తి శ్రద్ధలతో రంజాన్



టీ నర్సాపురం మార్చి 21 ప్రభాతవార్త : శుక్రవారం రాత్రి ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో టి నర్సాపురం శనివారం నాడు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ పర్వదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కళ్ళకు సూర్మా,అత్తరు సువాసనతో ముస్తాబైన ముస్లిం సోదరులు టీ నర్సాపురం మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు పాల్గొన్నారు.ఈ రంజాన్ మాసం ముప్పయి రోజులూ ఉపవాసాలు , నమాజులు , తరావీ నమాజులు , ఫిత్రాలు , జకాత్ ఇవ్వటాలు ... ఇలా నెల మొత్తం ఆద్యాత్మిక క్షణాలు గడుపుతూ ముప్పయవ రోజు నెలవంక దర్శనం ఇవ్వడంతో కుటుంబ సభ్యులతో ముస్లిం సోదరులు రంజాన్ పండుగ జరుపుకుంటారు . ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు సందర్భంగా మత ప్రబోధకులు మాట్లాడుతూ ఖురాన్ అవతరణ ప్రత్యేకత, పేదవారి ఆకలి గురించి ఆలోచించి వారికి సహాయం చేసే ఫిత్రా గురించి, ఆధ్యాత్మిక చింతన గురించి వివరించడంతోపాటు మొహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి జీవితం ముస్లిం సోదరులకు ఒక వెలుగని, రంజాన్ పండుగ విశిష్టతను తమ ప్రవచనాల్లో తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి వర్ధిల్లాలని, మత సామరస్యం వెల్లి విరియాలని, మానవ సంబంధాలు మరింత బలపడాలని కోరారు.ఒకరినొకరు అలింగనం చేసుకుని పరస్పరం ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. టి నరసాపురం ఎస్ఐ జయ బాబు గారు ప్రత్యేక ప్రార్థనల అనంతరం మసీదులో ముస్లిం సోదరులను కలిసి మతసామరస్యానికి రంజాన్ ప్రతీక అని ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు. వారితో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం ముస్లిం సోదరు చాకిరేవు చెరువు వద్ద ఉన్న ఖబరస్థాన్ చేరుకొని అమరులకు నివాళులర్పించారు. రంజాన్ ప్రత్యేక వంటకం ఖీర్ ఖుర్మాబంధుమిత్రులతో కలిసి రుచి చూశారు, ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యుల నుండి మహిళా సోదరీమణులకు సంతోషంగా చెల్లించే ఈధి కార్యక్రమాలతో టి నరసాపురంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో మత పెద్దలు షేక్ అబ్బాస్, షరీఫ్, సయ్యద్ మీర్ సాహెబ్, సయీద్ మాస్టర్, షేక్ లాలు, షేక్ అబూబకర్,షేక్ కరీముల్లా, ఉమ్మర్, సయ్యద్ అన్వర్,షేక్ యాసిన్,కాసిం మీరా, మీరావలి, ఇషా వలి, షమ్మీకపూర్, అమానుల్లా, అబ్దుల్లా,,మత ప్రబోధకులు మసీదు కమిటీ సభ్యులు యువజనులు పాల్గొన్నారు. శనివారం రంజాన్ పండుగ సందర్భంగా మసీదు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఎస్ ఐ జయ బాబు నేతృత్వంలో పోలీసులు ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఈనెల 23న ఫిర్యాదుదారుల సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి

### పోడూరులో సీపీఎం నేత కేటా గోపాలన్ పిలుపు



పోడూరు, మార్చి 21,ప్రభాత వార్త: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని, పాదయాత్రలో ఫిర్యాదులు అందజేసిన లబ్ధిదారులు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేటా గోపాలన్ పిలుపునిచ్చారు. శనివారం పోడూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 26న ఆకివీడు మండలం తామర్లకోడి నుంచి ప్రారంభమైన సీపీఎం పాదయాత్ర జిల్లావ్యాప్తంగా 20 మండలాలు, ఆరు పట్టణాల మీదుగా సుమారు 650 కిలోమీటర్లు సాగిందని తెలిపారు. ఈ యాత్రలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పార్టీ బృందం దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. పోడూరు మండలంలోని వద్దిపర్రు, రావిపాడు, గుమ్ములూరు, పెనుమాదం, పోడూరు, జగన్నాధపురం, జిన్నూరు తదితర గ్రామాల్లో నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా ప్రజలు పెద్దఎత్తున తమ వినతులు సమర్పించారని చెప్పారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు కొత్త పెన్షన్లు మంజూరు కాకపోవడం తీవ్ర ఇబ్బందులకు దారితీస్తోందన్నారు. అలాగే ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు, గృహనిర్మాణ రుణాలు, అర్హులందరికీ పెన్షన్లు, ప్రతి గ్రామానికి పరిశుభ్రమైన తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి సదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. పాదయాత్రలో దరఖాస్తులు ఇచ్చిన లబ్ధిదారులందరూ ఈనెల 23న కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నాలో పాల్గొని తమ సమస్యల పరిష్కారానికి స్వరం వినిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు, బురాబత్తుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ద్వారకాతిరుమలలో శ్రీ కుంకుళ్లమ్మ మహిమ

### - ఉగాది నుంచి 9 రోజులు లక్ష గాజుల అలంకారం ప్రత్యేక ఆకర్షణ



ద్వారకాతిరుమల,మార్చి21 ( ప్రభాతవార్త): ప్రతి భక్తుడి యాత్ర ఒక ప్రత్యేక అనుభూతి. ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చిన ద్వారకాతిరుమల లో శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శనం అనంతరం, గ్రామదేవత అయిన శ్రీ కుంకుళ్లమ్మ ఆలయం వైపు అడుగులు వేస్తే ఆధ్యాత్మికత మరింత పరిపూర్ణమవుతుంది. గ్రామమంతటికీ కాపలా కాస్తూ మహాశక్తిగా వెలుగొందుతున్న కుంకుళ్లమ్మను భక్తులు భువనేశ్వరి, రాజరాజేశ్వరి స్వరూపిణిగా భావిస్తారు. "చిన్న వెంకన్నా -- వెంకన్నా నారాయణి" సన్నిధిగా ఈ అమ్మవారి స్థానం ప్రత్యేకతను సంతరించుకుంది. స్వామివారి సమీపంలోనే ఉన్న ఈ శక్తి పీఠం, గ్రామానికి రక్షణ కవచంలా నిలుస్తుందని స్థానికుల విశ్వాసం. ఆలయంలోకి ప్రవేశించగానే రాజగోపురం, రంగురంగుల శిల్పాలు, పంచకలశాలు మనసును ఆకర్షిస్తాయి. గర్భగుడిలో పుష్పాలంకారంతో, రజతకవచంతో, త్రినేత్రంతో అలంకరింపబడిన అమ్మవారి దర్శనం భక్తులకు భక్తి భావాన్ని నింపుతుంది. ప్రతి రోజు దీపారాధన, పుష్పసేవలు ఎంతో శ్రద్ధగా నిర్వహించబడుతూ, భక్తులు కుంకుమ, అక్షింతలు సమర్పిస్తూ తమ కోరికలను తెలియజేస్తారు. ఉత్సవాల సమయంలో ఈ ఆలయం మరింత వైభవంగా మారుతుంది. ముఖ్యంగా ఉగాది పర్వదినం నుండి ప్రారంభమయ్యే 9 రోజుల పాటు అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించడం అత్యంత ప్రత్యేక విశేషంగా నిలుస్తుంది. అదేవిధంగా చైత్ర వసంత నవరాత్రులు, శరన్నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, శక్తి ఆరాధనలు ఘనంగా జరుగుతాయి. ఈ సమయంలో భక్తులు " శ్రీ కుంకుళ్లమ్మ మహిమ దీక్ష" స్వీకరించి ఆధ్యాత్మిక శక్తిని పొందుతారని నమ్మకం. గ్రామదేవతగా కుంకుళ్లమ్మ గ్రామాన్ని దుష్టశక్తుల నుండి కాపాడుతూ, వ్యాధులు, అపశకునాలు దూరం చేస్తుందని ప్రజల విశ్వాసం. శ్రీ వెంకటేశ్వరుని దర్శనం తర్వాత ఆయన సోదరి కుంకుళ్లమ్మను దర్శిస్తే యాత్ర సంపూర్ణమవుతుందని భక్తులు భావిస్తారు. ఏలూరు నుండి సుమారు 42 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పవిత్రక్షేత్రానికి రవాణా సౌకర్యాలు సులభంగా లభిస్తాయి. ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు దర్శనం అందుబాటులో ఉంటుంది. ఇలా భక్తి, విశ్వాసం, సంప్రదాయాల సమ్మేళనంగా నిలిచిన కుంకుళ్లమ్మ ఆలయం ప్రతి భక్తుడి హృదయంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.